క్లుప్తంగా

బకాయి జీతాలు చెల్లించాలని వినతి



వెలుగు ఏపీఎం అప్పలనర్సకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

మాడుగుల రూరల్: తమ పెండింగ్ జీతాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు ఏపీఎం అప్పలనర్సకు శనివారం వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, తమ సమస్యలపై జిల్లాలో జాయింట్ మీటింగు ఏర్పాటు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగింపులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31లోపు తమ డిమాండ్లు పరిష్కరించుకుంటే వచ్చే నెల 1వ తేదీ నుంచి విధులు నిర్వహించేది లేదని మండల వీవోఏల సంఘ ప్రతినిధులు తెలిపారు.

లెప్రసీ గుర్తింపునకు సర్వే



సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి సీతారామలక్ష్మి

మాకవరపాలెం: లెప్రసీ గుర్తింపునకు ఇంటింటి సర్వే ముమ్మరంగా చేపట్టారు. ఈ మేరకు మండలంలోని నారాయణరాజుపేటలో జరుగుతున్న సర్వేను వైద్యాధికారి సీతారామలక్ష్మి పరిశీలించారు. వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. లెప్రసీ నివారణే లక్ష్యంగా ఇంటింటి సర్వే చేపట్టినట్టు చెప్పారు. వచ్చేనెల 2 వరకు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. అలాగే క్యాన్సర్ వ్యాధిపైనా అవగాహన కల్పించడంతో పాటు ఆ లక్షణాలున్న వారిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వర స్వామి ఉత్సవాలు



గౌరీపరమేశ్వరస్వామి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ: చీడిగుమ్మల గ్రామంలో గౌరీ పరమేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గౌరీ పరమేశ్వరస్వామి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. కాంతారా శక్తి నర్తకులు అలరించారు. గ్రామంలో మహిళలు గౌరీపరమేశ్వరులకు పిండి వంటలతో సాగనంపారు. కమిటీ సభ్యులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టారు.

హౌస్ కమిటీ రిపోర్ట్ బయట పెట్టాలి

కె.కోటపాడు: విశాఖ డెయిరీలో జరుగుతున్న అక్రమాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు వేసిన హౌస్ కమిటీ రిపోర్ట్‌ను బయట పెట్టాలని సీపీఎం మండల నాయకుడు గండి నాయినిబాబు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం మహిళా పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఆవు పాల ధరను తగ్గించడం పై రైతుల నుండి పెద్ద ఎత్తున ప్రతిఘటన వచ్చినా డెయిరీ యాజమాన్యం ధర పెంచే చర్యలు చేపట్టకపోవడం రైతులపై వారికున్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఆవు పాలు లీటర్ రూ.50, గేదె పాలు లీటర్ రూ.100 చెల్లించడంతో పాటు రైతులకు రాయితీపై దాణా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాడి ప్రసాద్, యర్రా దేముడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి తీర్థం

మాడుగుల: మండలంలో వొమ్మలి జగన్నాథపురంలో శనివారం సర్పంచ్ జయరామ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి తీర్థం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారి నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళా కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఓటుహక్కు అందరి బాధ్యత

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ప్లకార్డుల ద్వారా ఓటు వేసే విధానాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



బుచ్చెయ్యపేట ఓటర్ల దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ తదితరులు





విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎంఈవో మూర్తి



జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చిత్రీకరించిన ఈవీఎం మిషన్



మాడుగులలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసీల్దార్ రమాదేవి

మాకవరపాలెం: ఓటు హక్కు అందరి బాధ్యత అని డీటీ సోమశేఖర్, ఎంఈవో మూర్తి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక ఉన్నత పాఠశాల, తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో మానవహారాలు ఏర్పాటు చేసి, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ కృష్ణమూర్తి, ఆర్ఐ జెట్టి, వీఆర్వోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల: స్థానిక తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లు షేక్ వలీ, ఎ. సూర్యారావులను సత్కరించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రాజా, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట: తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. వెలుగు ఏపీఎం టి. రాజబాబు, ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: మండల కేంద్రం రోలుగుంటలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంఈవో జగ్గారావు స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఓటుపై ప్రజలకు చైతన్యం కల్పించారు.

జె.నాయుడుపాలెంలో..

మండలం జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ ఓటరు దినోత్సవాన్ని హెచ్.ఎం.దాడిశెట్టి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు దినోత్సవాన్ని విద్యార్థుల ఆంగ్ల అక్షర రూపంలో ప్రదర్శించారు. అలాగే ఈవీఎం, ఓటు బాక్స్ చిత్రాలతో ఆకట్టుకున్నారు. ఓటుపై విద్యార్థులకు హెచ్ఎం రమేష్‌కుమార్ అవగాహన కల్పించారు.

నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు..

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల విద్యార్థులు ఓటరు నమోదు దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు అని ప్రిన్సిపాల్ పి. కిరణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాస రచన పోటీలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు కృపాచంద్, రేవతీదేవిలతో పాటు ఇతర స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందచేసి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీ మంగమ్మ, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు వి.అప్పలనాయుడు, ఎస్ఎం రఫీయుద్దీన్, హెచ్.సుధీర్, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో..

మాడుగుల రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.జె.పురం గ్రామంలో శనివారం సచివాలయ సిబ్బంది, పంచాయితీ ఉద్యోగుల సారధ్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఓటరు తమ ఓటును వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శి బి. నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు..

నర్సీపట్నం: ఆర్డీవో వి.వి.రమణ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి వారితో ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, తహసీల్దార్ ఎల్.రామారావు, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రమణబాబు, ఉపాధ్యాయులు రాజుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం హైస్కూల్లో..

నాతవరం: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు వేయాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. నాతవరం హైస్కూల్లో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా చేరాలన్నారు. అనంతరం వృద్ధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బలమైన ఆయుధం ఓటు హక్కు..

దేవరాపల్లి: ప్రజాస్వామ్యంలో బలమైన ఆయుధం ఓటు హక్కు అని, ప్రతి ఒక్కరూ దాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవరాపల్లి డిప్యూటీ తహసీల్దార్ కె. అప్పారావు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, విద్యార్థులతో కలిసి నాలుగు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. బోయిలకింతాడ గ్రామంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు.

ఓటు హక్కు పొందడం అందరి బాధ్యత..

కె.కోటపాడు: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు పొందడాన్ని బాధ్యతగా గుర్తించాలని తహసీల్దార్ డి.రమేష్‌బాబు అన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం కె.కోటపాడులో ఓటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమం జరిపారు. ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ గాయిత్రి, వీఆర్వోలు పూడి సురేష్, జగదీష్, శివ, అనంత్ తదితరులు పాల్గొన్నారు.



జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు చిత్రీకరించిన ఓటు బాక్స్



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



కె.కోటపాడు ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ రమేష్‌బాబు తదితరులు



బోయిలకింతాడలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు తదితరులు



వృద్ధులను సత్కరిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పెదనందిపల్లి పాడి రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీటీసీ నారాయణమ్మ



మేకలకు టీకాలు వేస్తున్న ప్రత్యేక అధికారి డాక్టర్ చల్లయ్య

మాకవరపాలెం: పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక అధికారి డాక్టర్ చెల్లయ్య సూచించారు. మండలంలోని జి. కోడూరు, సీతన్న అగ్రహారం గ్రామాల్లో శనివారం ప్రత్యేక పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పాల ఉత్పత్తి పెంపునలో మెలకువల వివరించారు. ఈ నెల 31 వరకు శిబిరాలు కొనసాగుతాయన్నారు. మాకవరపాలెం, రాచపల్లి పశు వైద్యాధికారులు మణిదీప్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పశుపోషణతో అధిక లాభాలు..

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, అప్పన్నపాలెంలో శనివారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ప్రత్యేక అధికారి డాక్టర్ చల్లయ్య పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పశుపోషణతో రైతులను లాభాల వైపు మళ్లించాలని ప్రభుత్వం ఆశిస్తుందన్నారు. పశువులు వ్యాధుల బారిన పడి మృత్యువాత పడకుండా మెగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. శిబిరంలో వైద్యాధికారి నరేష్ 45 పశువులకు గర్భకోశ చికిత్సలు, 320 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు. నర్సీపట్నం సహాయ సంచాలకులు డాక్టర్ రాంబాబు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదనందిపల్లిలో..

దేవరాపల్లి: పశుపోషణలో జాగ్రత్తలు పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు పాల దిగుబడి పెరుగుతుందని ఎం. అలమండ పశు వైద్యాధికారి కె.మంజుషారాణి తెలిపారు. పెదనందిపల్లిలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలతో పాటు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. అనంతరం స్థానిక ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ చేతుల మీదుగా పాడి రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, మందులు అందజేశారు. అనంతరం పశువుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశు వైద్యాధికారి మంజుషారాణి తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ పారిశుధ్యం



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం సాధ్యపడుతుందని బోయిలకింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అన్నారు. బోయిలకింతాడలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వీధుల పరిశుభ్రత, డ్రైనేజీల్లో పూడికల తొలగింపు చేపట్టారు. అనంతరం సర్పంచ్ బాబూరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, పాలకవర్గ సభ్యుడు అన్నం వెంకటరావు, బొబ్బిలి రాము, అన్నం సాంబమూర్తి, కడిమి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి

దేవరాపల్లి: మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమస్యలు పరిష్కరించనప్పుడు సదస్సు ఎందుకని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ మాట్లాడుతుండగా తరుగు పేరుతో రైతుల నుండి అదనంగా ధాన్యం డిమాండ్ చేస్తూ మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం తదితరులు తెలిపారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల పేరిట అసాంఘిక కార్యక్రమాలు చేపట్టి మండలానికి చెడ్డ పేరు తీసుకువచ్చారని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బూరె బాబూరావు తదితరులు నిలదీశారు. బోయిలకింతాడలో ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో అక్రమంగా రైస్ మిల్లు నిర్మించడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎ. కొత్తపల్లి హైస్కూల్లో నాడు-నేడు పనులు పూర్తి చేయడంతో పాటు అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాల్లోకి మార్చాలని కోరినా పట్టించుకోకపోవడంపై సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి మాట్లాడుతూ సభలో సభ్యులు ప్రస్తావించిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిక జారీ చేశారు. వైస్ ఎంపీపీ గంగా భవానీ, ఎంపీడీవో సువర్ణరాజు, డీటీ అప్పారావు, పరిపాలన అధికారి డీవీ లక్ష్మీనారాయణ, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



డీఎస్పీ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దళిత నాయకులు

నర్సీపట్నం: నర్సీపట్నం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పోతిరెడ్డి శ్రీనివాసరావును దళిత సంఘాల నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. డీఎస్పీని కలిసిన వారిలో చిట్ల చలపతిరావు, ఎం.అప్పలరాజు, పాపారావు, మరువాడ ఈశ్వరరావు, నూకరాజు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నాతవరం: మండలంలో 124 పనులకు రూ. 12 కోట్ల నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలో డి.యర్రవరం పంచాయతీలో రూ. 40 లక్షల అభివృద్ధి పనులకు సర్పంచ్ ఇనపసప్పల సత్యవతితో కలిసి భూమి పూజ చేశారు. మర్రిపాలెం పంచాయతీలో శ్మశాన వాటిక, రూ. 40 లక్షల అంచనాతో రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఇంత వరకు 55 పనులు పూర్తి చేశామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వెదురుపల్లి తారు రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లాలం అచ్చిరాజు, డి.యర్రవరం గ్రామపెద్ద సబ్బవరపు స్వామినాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

మాకవరపాలెం: అంబేడ్కర్‌కు బీజేపీ నేతలు ఘన నివాళులర్పించారు. రాజ్యాంగం రూపొందించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పిల్లా బాబూరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు చుక్కల శ్రీనివాసరావు, నారాయణమూర్తి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడితో భయం భయం



జనాలు తిరిగే దారిలో కోతుల సందడి

నాతవరం: గతంలో వ్యవసాయ ఉత్పత్తులనే నాశనం చేసిన కోతులు ఇప్పుడు రైతులపై దాడులు చేస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే పలు గ్రామాల్లో 30 మందికి పైగా మనుషులపై దాడి చేసి గాయపరిచాయి. ఇళ్లలోకి చొరబడి దాడి చేస్తున్నాయి. మండలంలో మర్రిపాలెం, వెన్నెలపాలెం శృంగవరం డి.యర్రవరం, నాతవరం, గాంధీనగరం, రాజుపేట అగ్రహారం, పెదగొలుగొండపేట ఏపీ పురం, ఎంబీపట్నం, గన్నవరం, గునుపూడి, వల్సంపేట గ్రామాల్లో కోతుల దాడిలో గాయపడిన వారున్నారు.

స్పందించని స్పీకర్..

డిసెంబర్ 19వ తేదీన మర్రిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి మాజీ వార్డు మెంబర్ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో రైతులు ఈ సమస్యను వివరించారు. ఆ సమయంలో వేదికపై ఉన్న జిల్లా ఉన్నతాధికారులు, కూటమి నాయకులు విన్నారు. రైతులు, గ్రామస్తులు చెప్పిన కోతుల విషయాన్ని స్పీకర్ శ్రద్ధగా విన్నారు కానీ.. పరిష్కార మార్గం చూపకుండానే మౌనంగా వెళ్లిపోయారు.

ఉత్తీర్ణులకు పట్టాల పంపిణీ

నర్సీపట్నం: మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి మదర్సా గరీబ్ నవాజ్‌లో మౌలానా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన హజ్రత్ అల్లామా మౌలానా హాఫిజ్ వఖారి ముహమ్మద్ ముబీన్ అహ్మద్ మిస్బాహి సాహబ్, మచిలీపట్నానికి చెందిన నౌజవాన్ హజ్రత్ మౌలానా ఎహ్సాన్ రజా తౌసీఫి సాహబ్ హాజరయ్యారు. వీరి చేతుల మీదగా కోర్సు పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేసారు. మౌలానా కోర్సు అవశ్యకత, మహమ్మద్ గురించి ఉన్యాసించారు. అనంతరం మదర్సా గరీబ్ నవాజ్ ప్రిన్సిపాల్ హాఫిజ్ ముహమ్మద్ తబ్రీజ్ రిజ్వీ, ముస్లిం పెద్దలు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం: ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దల్లిరాజర జిల్లాలో ఇటీవల నిర్వహించిన సుబ్రత క్లాసిక్ నేషనల్ అండ్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వర్ణం, రెండు రజత, మూడు కాంస్య పతకాలు సాధించారు. పదవ తరగతి విద్యార్థి అప్పికొండ పూర్వజ స్వర్ణ పతకం సాధించింది. ఎం. మణి, అమృతవల్లి రజత పతకాలు, కావ్య, అక్షయ, పూర్వజ కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన పీడీ దేవిని శనివారం ఆర్డీవో వి.వి.రమణ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి.ఈశ్వరరావు, హెచ్ఎం వి.రామకృష్ణ, ఉపాధ్యాయులు రాజుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న కుమార్

కె.కోటపాడు: రాజ్యాంగాన్ని గౌరవించి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్న పార్టీ బీజేపీ అని సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమ జిల్లా కమిటీ సభ్యుడు జి.సామ్రాట్ కుమార్ అన్నారు. రెల్లిపేటలో శనివారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగా హక్కులు, రాజకీయ పదవులు లభించనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మేడపురెడ్డి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షురాలు పైల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.